నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com
గురువారం 4-6-2020    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

విచిత్ర రోగం
తరిగి పెరిగింది
తాళం పడాలి?

రైతుల గోడు
మిడుతల దండయాత్ర
తాలు మిగులు

చెప్పింది విత్తు
నేలను బట్టి విత్తులు
స్వేచ్ఛా హరణం

ఎందుకు కయ్యం
మాకు లేదులే భయం
ఓ డ్రాగన్ బాబు

నీటి లేక్కలు
వీడని చిక్కు ముడులా!
కాల యాపన



- రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

నీళ్లొచ్చే పంటపండె
తెలంగాణ బంగారం !
బుగ్గిచేసేందుకు రెడీ
కరోనానె అంగారం !

మృగశిర కార్తే కూడా
వచ్చేసింది కరోనా !
ఇంకెందరు కావాలీ
ఇక వెళ్లిపో బిరానా !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# నెలక్రితం లాక్డౌన్



స్వేచ్ఛను వాదం:
-డాక్టర్ గుంటి గోపి
8019808207
ఆంగ్ల మూలం: రిచర్డ్ హెండ్రిక్ (ఐర్లాండ్)

అవును భయం ఉంది
అవును ఓంటరి తనం ఉంది
అవును విపరీత భయం ఉంది
అవును అనారోగ్యం ఉంది
అవును మరణం కూడా ఉంది

కొన్ని రోజుల నిశ్శబ్దం తర్వాత వుహాన్లలో
మీరు మళ్ళీ పక్షుల స్వరాలను వినవచ్చు
కొన్ని వారాల నిశ్శబ్దం తర్వాత
ఆకాశం పొగలతో మందంగా ఉండదు
నీలం బూడిద రంగుతో స్పష్టంగాకన్పిస్తుంది



అస్సిసి వీధుల్లో ప్రజలు ఖాళీ చతురస్రాల మీద
ఒకరినొకరు పాడుతున్నారు
వారి కిటికీలు తెరిచే ఉన్నాయి
ఒంటరిగా ఉన్నావారు చూట్టూ కుటుంబాల శబ్దాలు వింటున్నారు
వెస్ట్ ఆఫ్ ఐర్లాండ్ లోని ఒక హోటల్ ఇంట్లో
నిర్బంధం ఉండేవారికి
ఉచిత భోజనం డెలివరీని అందిస్తున్నారని అంటున్నారు
ఈ రోజు నాకు తెలిసిన ఒక యువతి తన పొరుగు వారికి
ఆ ప్రకటన ప్రచారంలో బీజిగా ఉంది
పెద్దలు ఎవరైనా ఉండవచ్చు కాల్ చేయండి

ఈ రోజు చర్చిలు, ప్రార్థనా మందిరాలు,
మసీదులు, దేవాలయాలు
నిరాశ్రయులను , ఆరోగ్యంతో అలిసిపోయిన వారికి
ఆశ్రయం కల్పించడానికి సిద్ధ మైన్నాయి
ప్రపంచ ప్రజలు మంద గించి ప్రతిబింబిస్తున్నారు
కొత్త మార్గంలో చూస్తున్నారు
ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు కొత్త వాస్తవికతకు దగ్గరవుతున్నారు

మనకు నిజంగా ఎంత తక్కువ. నియంత్రణ ఉంది
ప్రేమించడానికి మేము ప్రార్థిస్తాము
భయం ఉందని మేము గుర్తించుకుంటాం
కానీ ద్వేహం ఉండవలసిన అవసరం లేదు
అవును ఓంటరి తనం ఉంది
కాని ఒంటరి తనం ఉండవలసిన అవసరం లేదు
అవును విపరీత భయం ఉంది
కానీ భయం ఉండవలసిన అవసరం లేదు
అవును అనారోగ్యం ఉంది
కానీ ఆత్మవ్యాధి ఉండవలసిన అవసరం లేదు
అవును మరణం ఉంది
కానీ ప్రేమ యొక్క పునర్జన్మ ఎల్లాప్పుడు ఉంటుంది

ఇప్పుడు ఎలా జీవించాలో మీరు చేసే
ఎంపికను బట్టి మేల్కొండి

ఈ రోజు మరోసారి వినండి
మీ భయం యొక్క ఫ్యాక్టరీ శబ్దాలవెనుక
పక్షులు మళ్ళీ పాడుతున్నాయి
ఆకాశం మలి నరహితమైంది .... వసంతం వచ్చింది
మనం ఎప్పుడూ ప్రేమను చూట్టుముట్టాలేము
మీ ఆత్మయొక్క కిటికీలను తెరవండి2
మీరు ఖాళీ చతురస్రాన్ని తాకి లేక పోయినప్పటికీ పాడండి

# అన్ని రకాల ఇనుప కచ్చడాలను వారు ఛేదించారు..!



- డాక్టర్ కత్తి పద్మారావు
9849741695



జలందర్‌లో మేడల మీద నుండి చూస్తుంటే
హిమాలయాలు కనిపిస్తున్నాయి
ప్రకృతి సుందరంగా వుంది
మేఘాలు స్వేచ్ఛగా పక్షుల్లా తిరుగుతూ వున్నాయి
పక్షులు ఖండాంతరాలకు పయనిస్తున్నాయి
ఫ్యాక్టరీల పొగగొట్టాలు ధూమాన్ని వదలటం లేదు
అమ్మాయిలను వేధించే యువకులు
కాళ్ళు ముడుసుకు కూర్చున్నారు
అక్షరాలు రాని అల్లిక సమాజం నుండి
ఎంతో జ్ఞానం వచ్చింది
మా తాతయ్య, మా నాయనమ్మ ప్రేమ నుండి
మా నాన్న పుట్టాడు
వారు వెన్నెల్ని చూపిస్తూ వేడన్నం పెట్టారు
వారు చీకటిలో చిరుదివ్వె వెలిగించి
మాకు కథలు చెప్పేరు
కథ నుంచి కథ పుడుతూనే వెళ్ళింది
ఆ కథలో ఆశయం వుంది
కథలో ఆశ వుంది.. కథలో జీవన సౌరభావం వుంది
మేము చంద్రుణ్ణి మా గుడిసెల్లోకి ఆహ్వానించాం
మేము సూర్యుణ్ణి మా ఇంటికి కాపలా పెట్టాం
మా నాన్న నాటిన వేపచెట్టే
నన్ను ఈనాడు రక్షిస్తూ వుంది
మా తాతయ్య కుక్కకు ఒక ముద్ద, పిల్లికి ఒక ముద్ద
ఎందుకు వేశాడో అర్థం అవుతుంది
వారు చెట్లకు ఎందుకు పెంచారు?
వారు కుక్కలను, పిల్లులను మాతో సమానంగా
ఎందుకు చూశారో తెలుస్తుంది
వీళ్ళు స్వార్థం కోసం చెట్టు వేరును తవ్వారు
వాళ్ళు నారు పోస్తూనే వుండేవారు
చెట్టును, ఆకును, పూతను అన్నింటినీ
వారు ఆస్వాదించారు
పులక్కాల వాల్లో చేదు పక్కెలను తెచ్చి
బండపై తోమి తోమి వారు పులుసు పెట్టారు
చింత చెట్టు చిగురు కోసి
వారు పప్పులో వేసి రుచి తెచ్చారు
కొలిమిలో గొడ్డలి చేయించి
కర్రకి పిడి గొట్టేవారు.. మొద్దులు నరికాక,
చెమట పట్టాక వారు ఒంటిపై నీళ్ళు పోశారు
వారి ఒళ్ళు నిగ నిగ మెరిసింది
వారి పిక్కలు ఎప్పుడు బలంగా ఉండేవి
వారు తినడం కోసం బ్రతకడం లేదు
శ్రమలో నుండి శ్రమకోసం వారు బ్రతికారు
సంఘ జీవితాన్ని విచ్ఛిన్నం చేసిన అగ్రవర్ణుడు
చస్తే మోయటానికి మనిషి లేడు
కాటిలో శవం కాలేటప్పుడు మా వారు తత్వం చెప్పారు
శరీరంలో జీవశక్తులు పోవడమే మరణం సుమా!
'దానికి భయపడవలదని' వారు బోధించారు
వారు స్వేచ్ఛలో జీవించారు

అన్నిరకాల ఇనుప కచ్చడాలను వారు ఛేదించారు
ఎక్కడ ఏదీ ప్రకృతి నుండి దూరం చేయబడినా,
అది స్థబ్దీకృతం అవుతుంది
అందునుండి విపరీతమైన కణ విభజన ప్రాదుర్భవిస్తుంది
అది పెద్ద పుండుగా పరిణమిస్తుంది
ముఖానికి రంగులు రుద్దీ రుద్దీ
క్యాన్సర్‌కు గురవుతున్నారు
కాలిన కడుపును గంజితో నింపినప్పుడు క్యాన్సర్ లేదు
ఇప్పుడు మనిషికి మనిషికి దూరం అంటున్నారు
మరణించిన శవాన్ని పూడ్చడానికి
ఎవరూ అంగీకరించటంలేదు
భూమి నుండి మళ్ళీ వైరస్ పుడుతుందనేమో!
నిజమే! గ్లాసుడు పాలల్లో ఒక్క బొట్టు విషం
జీవితాన్ని నిర్జీవంచేస్తుంది
ముందు మనిషి ఆలోచనల్లోని వైరస్‌ను తొలగించుకోండి
మానవుణ్ని, ప్రకృతిని,
ప్రకృతిలో దాగున్న చలనాన్ని గుర్తించండి
అప్పుడు మళ్ళీ సహజీవనం
కోకిల స్వరం, దోర మామిడికాయ రుచి
ముంజికాయని మునివేళ్ళతో తీసుకుని తినే ఆనందం
గేటులన్నీ తెరవబడ్డాయి
మానవుని జీవన పునరుజ్జీవం తథ్యం.




# కవిత్వ రహస్య మెరిగిన కవి రామకృష్ణ

తెలుగు కవిగా ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డున నెల్లూరులోవుంటూ జాతీయ అంతర్జాతీయ వేదికలమీద కవితలు వినిపించిన ఏకొద్దిమంది కవుల్లో పెరుగు రామకృష్ణ ఒకరుగా పేరెన్నికకలవాడు. తనలోకి తాను ప్రవహిస్తూ ఎదుటివారిలోకి అదును పదునెరిగిన చూపుతో ప్రవహిస్తూ వర్తమాన సంక్షోభ సమాజ అంతరంగాన్ని ఆవిష్కరిస్తున్న కవీయన. తన కవిత్వానికి భావకత, పదప్రయోగం రెండు కళ్ళుగా భావిస్తూ కవిత్వాన్ని సామాన్యునివక్షాన నిలువుతున్న మాన్యకవిరామకృష్ణ. కవిత్వానికి చిరాయుస్సునిచ్చే దినుసైన దార్శనికతను పట్టుకున్న కవిగా, గొప్ప అధ్యయనశీలిగా, సమాజాన్ని ప్రేమిస్తూ లాలిస్తూ సంస్కరించాలనే తపనతో మున్ముందుకు పోతున్న అభ్యుదయవాది వినయం, విధేయత, వివేకం భావుకత, నిర్భీకత, నిష్పాక్ష పాతవైఖరి, ఆధ్యాత్మికత మీదమిక్కిలి తాత్త్వికతల, సత్తువతో పెరిగిన కవి పెరుగు రామకృష్ణ, ప్రపంచమే వో కుగ్రామమైన ప్రపంచీకరణ ఫలితంగా, జాతీయ, అంతర్జాతీయ వేదికలను అన్ని భాషల కవులు ఎక్కుతున్నారు. వారి భావాలను వినిపిస్తున్నారు. అంతర్జాతీయ కవితావేదికలను అందిపుచ్చుకునే యోచనలో యోగ్యత సంపాదించడంలో కష్టనష్టాలను లెక్కచేయని కవితాప్రియుడీయన. స్వచ్ఛమైన, నిశ్చలమైన మనస్సుతో ఆలోచనావైశిష్ట్యాన్ని అందలమెక్కిస్తూ, లోతైన భావాలకు ఊపిరిఒదులుతూ ఆలోచనావైశిష్ట్యాన్ని అందలమెక్కిస్తూ, లోతైన భావాలకు ఊపిరిబాదుతు, నిర్మలమైన కవిత్వపుచేష్టలకు చైతన్యానందిస్తూ, దేశ విదేశాల్లో రాణిస్తున్న వాడీయన. ఆలోచన, ఆవేశము పెనవేసుకొని జీవితంలో చొరబడిన

యాత్ర కతను ప్రశ్నించేదిగా ఉంటుంది వీరి కవిత్వం. వీరు బహుగ్రంథకర్త వీరు రాసిన కవితాసంపుపాలు...

వీరు ఈ సంవత్సరం ఆరు పదు వయస్సుల్లోకి అడుగిడుతున్నారు. పదవీ విరమణ మే 31న చేస్తున్నారు. వీరు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగం నుండి పదవీ విరమణ చేస్తున్నారే కాని, వీరికి ప్రవృత్తిగా ఉన్న సాహిత్య రచన నుండి మాత్రం కాదు. పదవీ విరమణ సందర్భంగా (2018 నుంచి 2020) వీరు రాసిన కవిత్వాన్ని ''దూదిపింజలవాన'' శీర్షికతో కవితాసంపుటిని వెలువరిస్తున్నారు. ఈ సంపుటిలోని కొన్ని కవితలను పరమార్శచేద్దాం.

2020 నూతన సంవత్సరం ప్రపంచాన్ని భయం గుప్పెట్లోకి నెడుతూ కరోనా మహమ్మారి విజృంభిస్తుంది. ప్రపంచం మొత్తం మీద దీని బారినపడి లక్షల మంది జనం మరణించారు. ప్రపంచదేశాధినేతలకు కరోనా గొప్ప సవాల్ విసిరింది. దీన్ని అదుపుచేసేందుకు శాస్త్రజ్ఞులు అన్ని దేశాల్లో అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ వైరస్ వ్యాధి కారణంగా ప్రపంచంలో కరచాలనాలు కరువైనాయి. ముద్దుముచ్చట్లు వద్దురా బాబు అనిపిస్తున్నారు. నమస్కారమే సంస్కారంగా భావించడం జరుగుతుంది. మానవసంబంధాల మధ్య మర్యాదలుంటున్నాయే అనే భయంతో భౌతికదూరాలు పాటించడం జరుగుతుంది.



ముక్కు, మూతి కనబడకుండా మాస్కులేసుకొని మనుషులు కళ్ళతో మాట్లాడుకుంటున్నారు. కరోనామీద మంచికవితలు రాశాడో రామకృష్ణ.

గతంలో రామకృష్ణ ఆయన కవితత్వాన్ని గూర్చిచెప్తూ సాహిత్యం మనుషుల్ని కలిపే వాహికని, జీవితంలో ఓదార్పుకోసం కవిత్వాన్ని ఆశ్రయించానని, కవిత్వంలో మనిషిని అభిషేకించి మానవతవాదిగా పునీతుణ్ణి చేయాలన్నది తన సంకల్పమని పేర్కొన్నారు. నిర్మలమైన రసానుభూతిలో వాలలాడే నిజమైనకవి. సత్యాన్వేషణే కవిధర్మం. మూఢాచారాలను హేతుబద్ధతతో శాస్త్రీయ దృక్పదంతో ఎదిరించి మనిషిని గ్రుడ్డినమ్మకాల నుండి విముక్తుల్ని చేయగలిగిన కవిత్వాన్ని అందించాలి అనేది ఈకవి దృష్టి, దృక్పథం. కవి ఎప్పుడూ వికృత ఆలోచనలకు వక్రభావాలకు తావియ్యకూడదు. కవి సృజనశీలిగా వర్తమాన రుగ్మతలమీద కలం కదపాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది రామకృష్ణ భావన.

సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమకాలీన సమస్యలమీద కవులు ఎక్కువగా స్పందిస్తుంటారు. ఆ విధ్వంసక రూపం యొక్క పుట్టు పూర్వోత్తరాలను, దాన్ని నశింపచేయడానికి అనువైన సూచనలను కవులుచేస్తుంటారు. అదే కోవలో కరోనా మీద కవితాయుధాన్ని ఎక్కుపెట్టాడీ రామకృష్ణ.

**"మనిషే ఒక శస్త్రం"** అనే కవితలో కరోనా ఏ విధంగా మానవసంబంధాలను తుడిచివేస్తుంది. మనిషి ఎందుకు ఏకాంతర వాసానికి వెళ్లిపోతున్నాడో, దీన్ని తదముట్టించాలంటే మనిషిలో ఏవిధమైన మార్పు రావాలి అనే అంశాల్ని రేకెత్తించి రసవత్తరంగా కవిత్వాన్ని ఆవిష్కరించాడు.

**"మనిషికి మనిషే శత్రువు చేసిన మహమ్మారి**
**మనుషులు జీవచ్ఛవాలయినప్పుడు**
**భయం రాత్రిపగలు ఒకటిచేస్తుంది.**

కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో దేశ, విదేశాల్లో ప్రతి మనిషి అనుక్షణం భయం గుప్పెట్లో వణికిపోతున్నారు. మనుషులు జీవచ్ఛవాలై నిరాశ, నిస్పృహలతో దిగులు మొకాలతో కనిపిస్తున్నారు. రాత్రింబవళు ఒకటే తోడు అదేభయం భయంతో పారిపోవడం, మేధావుల ధర్మంకాదు. విపత్తును ధైర్యసాహసాలతో ఎదుర్కోవడం మనిషి వీరత్వానికి పరిశోధనా తత్త్వాణి, హేతువిర్ధనిర్ణయత్వానికి నిదర్శనం. అందుచేత ప్రతి మనిషీ ఒక సైనికుడైన। రోగనిరోదకశస్త్రం కావాలి అని ఉద్భోధిస్తాడు కవి. కవిత్వరహస్యమెరిగిన కవి రామకృష్ణగా చెప్పుకోవచ్చు. శస్త్రాలులేవు, క్షిపణులులేవు, శత్రువుగుట్టురట్టు కానేలేదు. । శవాలు మాత్రం గుట్టలుగా । మహమ్మారి మనిషిపైనే గురిపెట్టింది. అంటూ మందు కనుక్కోబడని ఈ వ్యాధి తీవ్రతను చెప్తూ అన్నిదేశాల్లో విపరీతంగా జనం మరణిస్తున్న విషయాన్ని ఎత్తిచూపుతాడుకవి. బహుశ దీనికి కారణం **"పర్యావరణ స్పృహ కోల్పోయినందుకు । క్షమించమంటున్నారు ।** అంటూ నిశ్శబ్దపు విశ్వయుద్ధంలో" లో వ్యక్తపరుస్తాడు కవి.

ఈ కరోనాను తరిమికొట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్తూ "మనబాధ్యత" కవితలో శుచి, శుభ్రత, పరిసరాల భద్రతముఖ్యం... ప్రపంచమంతా ఒక విశాల రణరంగం అయింది అంటారు.

**నాలుగు గోడలమధ్యవున్నా । భౌతిక దూరంపాటిస్తున్నా । భుజాలపైనున్న బాధ్యతమిన్న దాన్ని మరచిపోవద్దు** అని హెచ్చరికచేస్తాడు కవి.

ఒక కవితలో **"మనిషితనం మొలకెత్తాలిప్పుడు అంటూ మనిషికి మానవత్వం ఉండాలి మనం యిప్పుడు మనిషి వాసన వస్తే చాలు** అంటారు. **ఇంకా కరోన మనిషిని సమూహం నుండి వేరుచేసి । ఏకాంతవాపు ఏకాకిని చేసింది** అంటారు.

వసంతరుతువును కోకిల్లై పాడేకవులు సైతం **"భయం గుప్పెట్లో వసంతగీతం పాడుతున్నారు. "సృష్టికొత్తగా పక్కకివొత్తగిల్లినందుకు । కొత్తస్వరంతో కోకిల ఉగాదిగీతం పాడమంది । శార్వరి ముందు శిరసెత్తుకోలేక । వంచిన తలతో స్వాగతం పలుకుతూ । భయంగుప్పెట్లో వసంతగీతం రచిస్తున్నాను.** అంటాడీకవి.

అంతటా లాక్‌డౌన్ బయటకు రాటానికేవీలులేదు. భయటకు రావటానికే వీలులేదు. ఇలాంటి తీరిక సమయం అందామా! నిర్భంధపువేళ అందామా ! జ్ఞాపకాల్లోకి మనిషి వెళుతుంటాడో. జీవితాన్ని వెతుక్కుంటూ కవితలో

**"నిశ్చలమైపోయిన బతుకుల్లో యిప్పుడు । జీవించిన క్షణాలువెతుక్కుంటున్నాను. । నిశ్శబ్దం యింత నిర్వీరం చేస్తుందా! అనుకుంటూ శబ్ధరహిత సమాజాన్ని నిరసిస్తున్నాను । స్వార్థనదిని ఈ ది ఈది అలసి నిర్భంధంలో నింపాది అయ్యాక । యిప్పుడు ధానం, ధర్మం, గుర్తుకొస్తున్నాయి. అని మనిషిని ఎత్తిపొడుస్తూ కరోనా మనకిప్పుడు ఏ సమాధానాలు భోదించలేదని మనిషి పునర్జీవనం కావడానికి । అనేకానేక ప్రశ్నలు మాత్రమే చూపింది.** మనముందు ప్రశ్నలు మాత్రమే నిలబడ్డాయి. సమాధానాలు యింకా వాటికి ఎదురు పడడం లేదు. అనేది కవి భావన.

ఈ కవి వయస్సు పైబడేకొద్ది, కవిత్వంలో మాగిపోతు, ఒక తాత్త్విక వాసనతీస్తున్నాడు. అందుచేతనే ఈ క్షణం మాత్రమే నీది అనే కవిత రాశాడు. **అందులో ఏది శాశ్వతం కాని సృష్టిలో ఆరాటపోరాటాలు । నీక్షణాన్ని మనసులో ఆనందించు ఈ క్షణం మాత్రమే నీది.**

**నలుగురికి క్షణాల విలువ । నీ జీవితం నీ సొంతం కావాలి ।** అంటూ అద్భుతమైన వో తాత్త్వికతను ఎత్తి చూపుతాడీ కవి.

**"పుట్టినపుడు పేరుండదు । ఊపిరొక్కటే ఉంటుంది । పోయేటప్పుడు ఊపిరుండదు । పేరు మాత్రమే ఉంటుంది అందుకే మనిషి ఊపిరి, పేరు లేకుండా మనిషి మాయమవ్వడం సర్వదండన మనిషి జీవితం అంటాడు. "నిన్ను నువ్వు ప్రేమించడం నేర్చుకో । మలుగురినీ ప్రేమించడం నేర్చుకో । కాలంలో నువ్వొక రెప్ప మాత్రమే । అనంతంలో నీ ఉనికి సేవాభావం చేతనైనంత వరకు పరోపకారిగా బతకమంటాడు** కవి.

**"గుండెకొలిమి"** కవితలో నేటి మనిషి నిజస్వరూపాన్ని ఎత్తి చూపుతూ "మనుషులందరూ కాలం తీర్చిన యంత్రాలయ్యాక । విలువలన్న తెరమీదనే ఆవిష్కరణ అంటారు.

**'ఎప్పుడూ నేను జీవిత విస్ఫోటనా వ్యధల్ని । మాత్రమే కవిత్వం చేస్తాను । కవిత్వ గర్భాన్ని తవ్వితీసిన । ప్రజలంతా బ్రతుకుని అభిషేకిస్తాను. నిలువుగా కూలిపోయిన వ్యథాభరితుల్ని ఓదార్చడమేలాగోనాకు నా తల్లి నేర్పింది । శరీర వెన్నెముకను పాతుము జీవిత జెండాను నిర్భయంగా ఎగరేయడం నా తండ్రి నేర్పాడు. ఆత్మ శిథిలాలకు జీవం పోసి జాగృత సంచారాల కొరడాలతో । ప్రపంచం చుట్టూ జైత్రయాత్ర చేస్తాను.**

అంటూ ఆత్మ విశ్వాసంతో ముందుకు పోతున్న పెరుగురామకృష్ణ అన్నట్లు గానే ప్రపంచం చుట్టూ జైత్రయాత్రగా కవితా యాత్రచేస్తూనే ఉన్నారు. కోదండరాముడిచ్చిన అభయంలో కవి రామకృష్ణయిచ్చినమాట నిలబెట్టుకుంటూ కవితా యాత్ర కొనసాగిస్తూ శేష జీవితాన్ని కవిగానే రాణింపజేస్తాడని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేస్తున్నాను.

మే 31న
ఉద్యోగ విరమణ సందర్భంగా
శుభాకాంక్షలు అందిస్తున్నాను.



కొండ్రెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి
సెల్ 99487 74243

## మానవతార

పాలమూరి
పాల సముద్రం సురవరమే!
ప్రతాపరుద్రీయమనే
ఈ కథా కావ్యానికి ఇది అవతారిక మాత్రమే!

ఆయన మేల్కొన్న తీరు
మేల్కొలిపిన తీరు
మన ప్రాథస్మరణలో మమేకమైతేనే మంచిది.

ఆయన మార్గదర్శే కాదు మానవతార కూడ!
నిరంకుశ నిజాం ప్రశ్నలనే కాదు
గెలికి కయ్యానికి కాలుదువ్వే వాళ్ళను సైతం
మళ్ళీ నోరెత్తకుండా చేసిన పనితనం వల్లనే
జనజీవన అస్తిత్వం చిగురించ గలిగింది.

సంస్థానాల జీవధారల వల్లనే అనుకుంట
రామాయణంలో దాగిన
అలల ఆత్మల ఆణిముత్యాలను
వెలికి తీసిన సముద్ర గర్భుడు అతడే.

నీళ్ళులేని నేలవాడైతేనేమి
ఆయనలోని సృజనాత్మక జీవనది వల్లనే
మన సాహిత్య నేల సస్యశ్యామలమైంది.

ఉర్దూ రాజ్యమేలుతున్న సమయాన
నిరాయుధమైన తెలుగు భాషను
తన పత్రిక ద్వారా
పరివ్యాప్తం చేసిన సంపాదక సమర వృక్షం అతడే.

మన పర్వదినాల్ని భుజాన వేసుకుని
వన్నె తరగని సంస్కృతికి
కళాకృత కల్పవృక్షమైనవాడు అతడే
గోల్కొండ కవుల సంచిక వల్లనే కదా
కవుల కళ్ళకు ఇంత వెలుగు దొరికింది
ఈ ధీరోదాత్తున్ని
శాసనసభ ఆలింగనం చేసుకుంది గానీ
అక్షరాన్ని వదిలి ఆత్మను అగమాగం చేసుకో లేదు గదా!

రాత్రనక పగలనక
చెరువులో ఈదే చేపపిల్లలానే బతికాడు
ఎల్లవేళలా అడుగుతీసే అక్షర యోధులకు
లోలోని నల్లమల అరణ్య సోయగాన్ని అర్పించగలడు.



- డా॥ నాళేశ్వరం శంకరం
సెల్: 944045 1960

## వాక్యం

ఒక కవితా వాక్యం కోసం
బాసింపట్టు వేసుకొని
తపస్సుకు కూర్చున్నాను.
తపస్సు విఫలమైంది.

ఎప్పుడో నా పనిలో నేనుండగా
పూవుమీద వాలే సీతాకోకలా
హృదయంలో వచ్చి వాలిందా
కవితా వాక్యం.

## వంతు

మసిబట్టి చీకటి మూలపడేసిన
లాంతరుని
శుభ్రం చేస్తున్నాను.

'చేతులకు నుసి అంటుతుందనీ'
'పనికిరాని లాంతరని'
'చమురు దండగని'
'దండగమారి పనని'
చుట్టూ కొన్ని నాలిక లేని నోళ్లు
నా నిండా మాటలమసి పూస్తున్నాయి.

చిరునవ్వుతో అన్నీ పక్కనపెట్టి
లాంతరు వెలిగిస్తే..
నోళ్లన్నీ నోటి మీద వేలేసుకొని
వెలుతురు చుట్టూ చేరడానికి
వంతులేసుకుంటున్నాయి.

## జీవిక

నింగీ నేలా
నీరూ గాలి
చెట్టూ పుట్టా
పశుపక్ష్యాదులు
సమస్త ప్రాణులు
నీవు లేకున్నా గానీ
నిమ్మలంగా మనగలుగుతాయి..

కోటిన్నొక్క రకాలుగా
నువ్వెన్ని తూట్లేసినా
చలించని ఈ ప్రకృతి
ఈషన్మాత్రం
నీ చిటికెన వేలు వదిలిందా..
నీవేమాత్రం మనలేవు.

నీ లోకమంతా తలకిందులై
నీ సమస్త విజ్ఞాన వస్తు సంపదలన్నీ వదిలి
అచ్చెరువొందుతూ మనిషీ..
నువ్వొక్కడివయిపోతావు...
నీవొక్కడివే మనలేక
ముక్కలయిపోతావు.

భూమి పచ్చదనంలోనే
ఆకాశ నీలిమలోనే
నీటి స్ఫటిక స్వచ్ఛతలోనే
నిర్మల గాలి వింజామరలలోనే ఇక
నీ
జీవిక.



-పి.శ్రీనివాస్ గౌడ్
9949429449

## అంతశ్శోధన

చిత్రకారుడి నిశ్శబ్దంలా
విలుకాడి ఏకాగ్రతలా
చెలికాడి ఆరాధనలా
నల్లమేఘం దుఃఖాశ్రువులా
లాక్ డౌన్ తొడిగిన
ఏకాంతపు ముసుగుతో
రోడ్డిప్పుడు విచారగ్రస్త

ఇల్లంతా వేసవి వెల్లతో
ఉడికిపోయిన జీవితాలు
టెర్రస్ పై వీచేగాలిలో
వేణుగానాన్ని వెతుక్కుంటున్నాయి
మారినకాలం ఇంకెన్ని మలుపులు తిప్పనున్నదో..
ఇంకెన్ని ముడులు విప్పనున్నదో
మరెన్ని ముడుపులు కట్టమంటుందో
అందరి ఆలోచనలదీ దారి ఒకటేకదా...

ఉన్నవారికీ.. లేనివారికి...
ఒంటరితనమే తోడూ నీడగా
కాలం పూచిన దుస్వప్నం
స్వైరవిహారం ఆగేనా..నిలిచేనా
సమాధానం తెలియని ప్రశ్నలకు
జవాబిచ్చే క్విజ్ మాస్టర్లు జీవితంలో ఉండరు కదా
ఎవరో నవ్వుతున్నారు
అంతశ్శోధనకు మించిన
శోధనా ఉందా అంటూ...



-సి.యస్.రాంబాబు
8374818961

## ప్రాణమా నిన్నెక్కడ దాయాలి?

చికున్ గున్యాతో చిక్కుకుని కీళ్ళు పట్టుకుపోయాక
స్వైన్ ఫ్లూ కూడా తోడై
జ్వరమంటేనే మందికి వణుకు తెప్పించె
డెంగ్యూ దోమ కాటునుంచీ తప్పించుకోలేక
తెల్లరక్త కణాలు సైతం తెల్లబోయిచూసె
నిఫారోగం నిద్రలేచి తలచుకుంటేనే కళ్ళకు కునుకు దూరంచేసె
వంశపారంపర్యంగా ఆస్థులొచ్చినా రాకున్నా
అవ్వతాతల రోగాలు వద్దన్నా వచ్చె
జంకు గొంకులు గొన్న జిహ్వాచాపల్యం
క్యాన్సర్లు ఇన్ ఫెక్షన్లతో కాలుదువ్వె
దోమ చీమ కోడీ పంది మాత్రమేకాదు
చీకటిగుహల్లో దాక్కుని బ్రతికే గబ్బిలమూ నేడు
కరోనా రెక్కలల్లార్చికాలయముడై గుమ్మం ముందు కూర్చునె
ఒళ్ళంతా విప్పుకు తిరిగినరోజులు మాయమై
అంగుళమంగుళమూ కప్పుకుని అడుగు బయటపెట్టక
కడుపు కాలు కట్టుకుని మూలకూర్చున్నా
నిలువెల్లా ఎవరెవరిపాపాలో తరుముకొచ్చి
ఆఘమేఘాలపై విషవాయువై కమ్ముకొచ్చి ఉసురుదీసుకెళ్ళె
ఏడేడు సముద్రాలు దాటెళ్ళినా
ఏ మర్రిచెట్టుతొర్రలో దాచినా
పచ్చని ప్రకృతికి మనిషిచేసిన అన్యాయం
కాలయముడై వెంబడిస్తోంది
ఓపికున్నంతవరకు తెలివి తెచ్చుకుని పరుగెత్తగలిగితేనే
నేడు బ్రతుకు చెల్లు!
అలసిపోయినా అశ్రద్ధచేసినా
ఆ క్షణమే ఇక ఆయువు నిల్లు!



-దేగల అనితాసూరి,
9247500819.

## ధరిత్రి మెరుపులు

మొక్కలను పెంచి
ధరిత్రిని కాపాడాలి
చెడును తుంచి
సమాజాన్ని కాపాడాలి !!

మొక్కలు వుంటేనే
ఆయువు మనకు
చెడు లేకుంటేనే
కలుగుతది మంచిమనకు !!

ఆటుపోట్లను ఎదుర్కొంటది
బలమైన ధరిత్రి
అవమానాలను ఎదుర్కొంటది
ఓపికున్న మహానేత్రి !!

ప్లాస్టిక్ సంచులకు
శరణం పలకాలి
దారం సంచులకు
ఆహ్వానం పలకాలి !!

దారంతో ధరిత్రి
బలపడుతుంది
ప్లాస్టిక్ తో ధరిత్రి
పలచబడుతుంది !!

శక్తిహీనమౌతుంది ధరిత్రి
రసాయన ఎరువులవల్ల
బలంపుంజుకుంటది ధరిత్రి
కృత్రిమ ఎరువులవల్ల !!

కొత్తరోగాలకు నాంది
రసాయన ఎరువులు
రోగాలుతగ్గించే గాంధీ
కంపోస్టు ఎరువులు !!

విషవాయువులను తొలగించి
ధరిత్రిని బ్రతికిద్దాం
విషగాలులను బంధించి
ధరిత్రికి మంచిచేద్దాం !!

ఇంటికొక్క చెట్టు
ప్రాణవాయువు
బ్రతికిస్తది ఒట్టు
ఆక్సిజన్ వాయువు !!

ధరిత్రి కలుషితంకాకుంటే
మనకు ఆరోగ్యం
ధరిత్రి బాగుంటే
మనకు మహాభాగ్యం !!

ధరిత్రిని రక్షించుటకు
ప్రతిన పూనాలందరము
శుభ్రతను పాటించుటకు
తీర్మానించాలి అందరము !!

కరోనాకు మూలం
అపరిశుభ్రతే
కరోనాకు మరణం
పరిశుభ్రతే !!

ధరిత్రికి రోగమంటే
మనప్రాణం పోవుట
ధరిత్రికి ఆయుష్షుంటే
మనమందరం బ్రతుకుట !!

పచ్చదనం పరిశుభ్రతే
ఆరోగ్యానికి మందు
ధరిత్రిని కాపాడితే
అదేమనకు గొప్పవిందు !!



-తాండ్ర చిరంజీవి
9959180762.

## పుడమిపరిమళం

వసుధ పుడమి నేలమ్మా భూమాత
ఏ పేరుతో పిలిచినా ఒకటే
అక్కున చేర్చుకోవడమే నీకు మక్కువ
అదీనూ సమతాహృదయంతో..!

ఎందరో మహనీయులు
నీ ఒడిలోనే పెరిగి పెద్దయ్యారు
అమ్మలు పంచే ప్రేమ
నీ నుంచే స్ఫూర్తి పొందుంటారు!

శిఖరాలెక్కి మురిసేవాళ్లయినా
దుఃఖపుటూబిలో చిక్కి
చిక్కులు పడే వాళ్లయినా
అంతా నీ సమక్షంలోనే గదా
కలిమిలేముల కావడికుండలైనా
సుఖసంతోషాల అలికిడైనా
అంతా నీ సాక్షిగానే గదా!!

రత్నగర్భవు నీవు
సంపదసముద్రానివీ నీవే
అయినా
కుబేరులదే హడావుడీ
దీవించిన నీదేమో అమాయకత్వం!

నీ గుండెను చీల్చి పంటలుగా
అందివ్వడానికీ
రైతుని తోడు తీసుకుంటావు
మీరిద్దరూ లేకపోతే
ప్రపంచానికంతా దుర్గతే!

పచ్చని చెట్లే నీ నేస్తాలని
పాడి పంటలే నీ ఆస్తులని
సర్వమానవాళి శ్రేయస్సే నీ ఆనందమనీ
చాటింపు లేకుండా చాటుకుంటావు!

నేలపై బతుకుబండి లాగే మనిషి కాసింత
చిల్లర పోగవగానే పొంగులెత్తుతాడు
నేలకు కంచెలు వేసుకునీ
నాది నాదేననీ ప్రకటిస్తుంటాడు
అయినా
మౌనంగా నవ్వుతావే తప్ప శిక్షించవు!

నిన్నెన్ని రకాలుగా కించపరిచినా
మనిషి కోసమే నీ తిరుగుడంతా!
నీ క్షమాగుణానికి చేస్తున్నాము
సాష్టాంగ ప్రణామం...!!

-చెరుకూరి వెంకట లక్ష్మి

## హస్త భూషణం

కలకాము తోడుగ
మనిషి యెద సవ్వడిగ
జేబు రమాలుంటది
జీవితాన నీడగ !!

ఆపదలో నున్నప్పుడు
తోడు ఎవరు లేనప్పుడు
జేబునుండి బయటికొచ్చి
సేవ ముందు జేయప్పుడు !!

కష్టములో తోడొస్తది
కంటి చెమ్మ తూడుస్తది
అమ్మగ తను మారిపోయి
నాశిక శుభ్రము జేస్తది !!

సూర్యుని తాపానికి
కురిసే వర్షానికి
రక్షణగా వుంటది
చల్లని చలి గాలికి !!

అమ్మగాధరస్తది
ఆలిసేవ జేస్తది
అనునిత్యము వీడకుండ
అపురూపము జూస్తది !!

చూస్తే జానెడుండదు
ప్రాణమేమి వుండదు
సీటుమీద పులిగ మారి
తరుమ కుండ మానదు !!

స్వేదాన్ని తూడుస్తది
గాయానికి కట్టైతది
అంతా శుభ్రము జేసి
తను మురికిగ మారుతది !!

సహనానికి సలాము
సేవలకే గులాము
తోడు తాను వుందంటే
బ్రతుకంత సుఫలాము !!

బట్టకున్న విశ్వాసము
జగతిలోన రాదు సమము
ప్రాణమున్న మనిషి కన్న
వేయి రేట్లు దస్తి ఘనము !!

చిరకాలము చిరాయువుగ
వెలుగొందుము నిత్యముగ
హస్తభూషణానివై
కాంతులీను యుగాంతముగ. !!



-పోమాల హన్మంతు
9989934521

## మెరుపులు

సూర్యునిచుట్టూ
భూప్రదక్షిణం
స్వార్థంచుట్టూ
మనిషి ప్రతిక్షణం

చల్లని వెన్నెల
చంద్రుడిచ్చును
ఊహల ఊయల
మనిషి మెచ్చును

మండే ఎండలు
మే నెలలో
వానల ఊహలు
మనసులలో

వాన కురిస్తే
నల్లమబ్బు తేటబడును
కష్టంలో కన్నీరొస్తే
గుండెబరువు తేలికగును

మెరుపు మెరిస్తే
గొడుగుకు పని
భావాలు కురిస్తే
కలానికి పని

మబ్బులు ఢీకొని
పిడుగులు రాలును
కలహము వద్దని
పాఠము నేర్పును

హరివిల్లు విరిస్తే
నయనానందము
చిరుగాలులు వీస్తే
హృదయానందము

ఏడు రంగులున్ననూ
హరివిల్లుగ కలిసుండును
కులమతాలు వేరైననూ
మనుషులు కలిసుండవలెను

చిగురించిన పూలకొమ్మకి
మొగ్గలందం
వికసించిన విరులకి
సీతకోకచిలుకలందం

ఒకేసారి పుట్టిననూ
ముందే మెరుపొస్తుంది
ఉరుము వెనుకబడిననూ
ఉనికిచాటి తీరుతుంది.



-గుడిపూడి రాధికారాణి
9494942583.

## తెలుగు

అనాదిగా
నాద జలధిగా
అమృత త్వం నింపుకున్న
ఆత్మీయతా గీతం.. తెలుగు.
సమయ సుధా వాహినిలో
మధురంగా
లలితంగా
రస భరితం గా
నవ హరితంగా
జీవనాకాశపు ప్రకాశావరణంగా
అనునిత్యం చేతనత్వపు
భావనా గగనమై వెలిగే
కమనీయ కాంతి యవనిక తెలుగు.
చరిత గతులకు నడక నేర్పే
భవిత కథలకు నవత కూర్చే
అనంత మానవతా ప్రాకారం తెలుగు.
జాతి ప్రగతికి జీవ నాడిగ
జగతి సుగతికి సత్య దీప్తిగ
చలన నైపుణ్యాన్ని
గమన సౌశీల్యాన్ని
అందించే భవ్య భావనా సుమం తెలుగు.
అమ్మ మమత లోని మమకార స్వరం తెలుగు.
పల్లె గుండెను పల్లవించే
చల్లని మలయ సమీరం తెలుగు.
ఎల్లలెరుగని,కల్లలెరుగని
కరుణ కలిగిన కాంతి తీరం
విశ్వ వీణా తంత్రులను మీటే
దివ్యమైన శాంతి కుటీరం



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

## ఏవి జననీ...! ఏవి జననీ..!

ఏవి జననీ...! ఏవీ జననీ
బ్రతుకు తెరువుల భవ్య గీతాలు
మనసు నవ్విన రమ్య రాగాలు

బ్రతుకు గుండెలు తల్లడిల్లీ

ప్రాణాలను వదులు తుండే
సాధించిన స్వాతంత్ర్యమంతా
కళ్ళ ముందే ఒలుకుతుండే

నిర్లక్ష్యపు నీడలొచ్చి
వెలుగు నవ్వులు కూలిపోయే
ముద్దు మాటలు మూగబోయే
భావితరమే ...నీరుగారే..!
వలస జీవుల మనసు విరిగే
కాలినడకలు కమిలిపోయే

చిగురు తొడిగిన పూల రెమ్మలు
మొగ్గ తొడగక రాలిపోయే..
రహదారులన్నీ నిశ్శబ్దమాయే
సత్యవాక్కులు ఆబద్దామాయే
కరచాలనాలే శత్రువాయే
ధరిత్రి హృదయమే శోకమాయే..!

ఏవి తండ్రీ...! ఏవి తండ్రీ
స్వేచ్ఛగాలుల స్వాగతాలు
స్వచ్ఛ జీవన స్వ గతాలు
కరోనాలు కాలుదువ్వే
మరణ ఘోషలు మారుమ్రోగే

కష్ట జీవి ముదము వీడే
ధర్మ నిరతి తొలగి పోయే..
నీతి నియమాల జాడ లేవి
బ్రతుకు తెరువుల వాడ లేవి!?

ఏవి తల్లీ...! ఏవి తల్లీ
అలనాటి జీవన వెలుగు కళ్లు
అలనాటి భావన మెరుగు మైళ్లు
అలనాటి కలల ఆనవాళ్లు
అలనాటి కళల మెచ్చుకోళ్లు..!?



-కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

## దాంపత్యం..!!

మనసిచ్చిన మగువకన్నా..
మగవానికి ఏదీ కాదు మిన్న
మనువాడిన ప్రియురాలికి
ప్రియుడే మక్కువ! ఎన్ని సంపదలున్న!

ఆమె! అతని ప్రాణం
అతనే ఆమెకు జీవితం!

దాంపత్యం వడ్డించిన విస్తరి కాదు
సంసారం అనుకున్నంత తేలికా కాదు!

అన్నీ కలిసొస్తాయని
ఎందుకనుకోవటం
ఓటమిని చూసి ఎందుకు
ఓర్పుని చంపుకోవటం..!

నిందించుకునేంత పొరపాట్లు
ఏముంటాయని..
మదిలో నింపుకున్న ప్రేమ అంతా
చిన్న చిన్న తప్పులకే ఖర్చయితే ఎలా..?

ప్రపంచం కనిపిస్తున్నంత
అందంగా ఉండదు
అందులో మనం అనుకున్నంత
యుద్ధం ఏది జరుగదు..!

ఒకరినొకరు గెలిపించుకునే అనురాగం
ఇద్దరిలోవుంటే...
గెలిచే అవకాశం
ఆదర్శ దంపతులది..!!



-శివ మంచాల
9004428159

## అన్న -మొగ్గలు

గుండెలో పెట్టుకుని కంటికి రెప్పలా చూస్తూనే
గుండెంత ధైర్యాన్ని ఇస్తూ వెన్నంటి ఉంటాడు
కష్టాల కడలిలో కన్నీళ్ళు తుడిచే నావికుడు 'అన్న'

అమ్మ లేని లోటును తీరుస్తూ అన్నీ తానవుతూనే
నాన్న అనురాగాన్ని అక్షయ పాత్రలా అందిస్తాడు
కష్టాల చీకటిలో దారి చూపే కాంతిపుంజం 'అన్న'

రక్తం పంచుకుని పుట్టిన ప్రేమాను రాగాలతోనే
చివరి రక్తపు బొట్టువరకు బాధ్యత తీసుకుంటాడు
ఇలలో నిత్యం కాపాడే ప్రత్యక్ష దైవం 'అన్న'
నాన్న ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటూనే
బాధ్యలను పంచుకుంటూ పెద్దన్న పాత్ర పోషిస్తాడు
ఇంటిల్లి పాదికి రక్షణ కల్పించే సైనికుడు 'అన్న'

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
77802 77240

## ఎందరు గుర్తుంచు కుంటారో??.

ఒడ్డెక్కిన మరుక్షణం
నొక్కింది ఫాస్ బటన్ భూగోళం
ఆగింది ప్రపంచ గందరగోళం
భూమికి చేస్తున్న నష్టాలగురించి ఆలోచించాల్సిన సమయం
భూమాత గోడు వినకతప్పని తరుణం
ధరిత్రి ఇక నొక్కింది రీసెట్ బటన్ ఇదే అదనుగా
అయ్యింది ఆకాశం నిర్మలంగా
పారుతున్నాయి నది జలాలు స్వచ్ఛంగా
పక్షుల కిల కిల రాగాలతో పులకిస్తోంది అడవి అందంగా
తోచింది అందరికి ఇది ఒక ఆలోచించాల్సిన విషయంగా
భోదపడితే మంచిది జీవించాల్సిన అసలు విధానం
ఆచరిస్తే ఆరోగ్యం అంతటా ఆనందం
ఎందరికి అర్ధమవుతుంది మరి ఈ అనుభవ పాఠం
ఎందరు గుర్తుంచుకుంటారో ఒడ్డెక్కిన మరుక్షణం
మనలాగే అన్ని జీవులకు జీవించే హక్కు ఉందని
మనం చేసే వినాశనానికి అవి ఘోషిస్తున్నాయని..,



-ఎ. ఎమ్. జయశీల
సెల్: 90598 25353

## జలం

జలం జగతికి మూలం
జలం లేనిది
జగతికి భవిత లేదు

భూగర్భంలోని
పాతాళగంగను
భగీరథ యత్నంతో
భూవి పైకి తెచ్చి
మనిషి బ్రతకాలన్నా,
చెట్లు ఎదగాలన్నా
పుడమి ఒడిలో జీవరాశులు పరిఢవిల్లాలన్నా
జలమే జీవనాధారం

వర్షంతో వచ్చే నీటిని
వృధా చేయకుండా
భగీరథ యత్నం విరమించకుండా

చెరువులు కాంటూరు గట్లు,
చెక్ డ్యాంలు, ఫారమ్ పాండ్,
ఇంకుడు గుంతలతో నీటిని
ఒడిసి పట్టి

భూగర్భజలాలను అడుగంటకూండా చేద్దాం
నీటిని పొదుపుగా వాడుదాం.
నీరే సమస్త జీవులకు ప్రాణాధారం...
నీరే భవిత, నీరే విజేత...
జలరాసుల సవ్వడులే
జీవానికి నిచ్చనలు,
జలమే జగతి ప్రగతికి
ఆయువు...
ఆ ఆయువును ఒడిసిపట్టి
సిరుల పంటలు పండిద్దాం,
ఆకలి లేని సమాజాన్ని నిర్మిద్దాం...



-చాపల మహేందర్
9949864152.

## అమ్మ ఓ బొమ్మే

అనురాగాల ఆలింగన సాక్ష్యంగా
అందమైన బృందావనంలోకి
నన్ను ఓ మొక్కలా ఆహ్వానించింది

నేను ఎలా ఉంటానో తెలియదు
ఏమౌతానో తెలియదు
అయినా తన శక్తినంతా కూడగట్టి
తన ఉదర భారాన్ని పంటి కింద అదిమిపట్టి
నడవలేక నడుస్తూ
తొమ్మిది మాసాలు కడు జాగరూకతతో
కంటికి రెప్పలా కాచుకుంటూ చూస్తుంది.

తన ఆరోగ్య ప్రభావం నాపై పడొద్దనీ
నచ్చనివి తింటూ నచ్చినవి వాంతులతో ఒదిలేసి
కండరాలు, ఎముకలు నుజ్జు నుజ్జయినా
తనకంటే మిన్నగా, అపురూపంగా చూసుకుంటూ
నేనెప్పుడు తనతో జతై ఆడాలని
వేయి కళ్ళతో వేచి వేచి చూస్తుంది అమ్మ.

పక్కటెముకల శబ్దంలోంచి
తన ప్రాణాలన్నింటిని పణంగా పెట్టి
పవిత్రంగా జన్మనివ్వగనే తన కష్టాన్ని మరిచి
మోము రెండింతలై ప్రకాశించగా
కళ్ళలో ఆనందాన్ని, తన్మయత్వాన్ని తెలిపేలా
నా కొత్త దేహాన్ని తడుముతూ పులకించింది అమ్మ.

ఆ అమ్మ చేతి స్పర్శలో భరోసా
ఆ లాలనలో నాపై విసిరిన నవ్వుల్ని
పసిదాన్నైనా వసి వాడకుండా చూస్తానని చెప్పాలనిపించే
తాపత్రయంతో
నా చిన్ని చేతితో అమ్మని తడిమితే
తను నా కోసమే ఓ అందమైన బొమ్మై
నన్ను ఆడిస్తూ, మురిసిపోయింది అమ్మ.



-విజయలక్ష్మి మార
9533333191

## పూలబాట

పవరు వలన వచ్చు పలకులకు వెలగు
పదవి లేని నాడు పలుకు వలదు
పదవి బలము లేక పలుకు చీకటగును
పుండలీకు మాట పూలబాట

సర్వ కార్య మందు సహకారమందించు
పడతి భరత జాతి భాగ్యరేఖ
ఆలి లేని ఇల్లు అందకా రమగును
పుండలీకు మాట పూలబాట

గాలి లోన మేడ కట్టు యువకులంత
పగటి కలలు కంటు బతుకు తారు
కష్టపడిన వారు కార్యము చేస్తారు
పుండలీకు మాట పూలబాట

తెల్ల కోటు తొడిగి చల్లని మనసుతో
కరొన వ్యాధి బాప కష్ట పడిరి
నరుని రూపు లోని నారాయ ణులువారు
పుండలీకు మాట పూలబాట

ధరణి శక్తి బిందు దశను మార్చునరుని
భూమి కలగి నున్న భుక్తి దొరుకు
నేల తల్లి నమ్మ నెప్పుడు మేలగు
పుండలీకు మాట పూలబాట

-జాధవ్ పుండలిక్ రావు
9441333315

పుస్తక సమీక్షలు

## వినూత్నమైన కథలు "రూపాంతరం"






నేటి ఆధునిక సాహిత్యంలో కవిత్వాన్ని కవిత్వంగానే, కథను కథగానే మలచగల శక్తి జ్వలితలో ఉందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.. కొందరు కవులు కథల్లో కూడా కవిత్వాన్ని తెలిపాలనే ప్రయత్నం చేస్తారు. కథలా రాసి కవిత్వమనేవారు లేకపోలేదు. అందుకే ఈ ప్రస్తావన. కథల్లో పాత్రలు దాదాపుగా మనం గుర్తెరిగిన, ఎదురైన, అనుభవించినవే అయినా, వీరి కథల్లో గాఢత, ఆర్థ్రత కనిపిస్తాయి. ఎందుకంటే వీరి కథలు చదువుతుంటే నేను ఈ వాతావరణంలోకి రావడానికి కాస్తంత సమయం పట్టింది.. ఏ ప్రక్రియ చేపట్టిన వాటికి న్యాయం చేయగలగడమే వీరి కలం ప్రత్యేకత. మనలో అనేకమంది "బాధ్యత" అనే పదాన్ని వాడుతుంటాం. ఆ పదం పలకడం చాలా సులువు. కానీ వీరు తమ కథల్లో బాధ్యతను చూపారు. జీవించడం అంటే తినడం, నిద్రపోవడం, కనిపించినవారితో పనికిరాని కబుర్లు చెప్పడం అనుకుంటారు కానీ జీవించడం అంటే ఏంటో, జీవితంలో ప్రతి అణువు పాత్ర ఎంతో చెప్పగలిగే స్థైర్యం ఉన్న కథలివి.

అందుకు వీరు రచించిన "ఆత్మాన్వేషణ" కథ మచ్చుతునక. ఏ బంధమూ శాశ్వతం కాదంటూనే జీవితంలో ఎదురైన వ్యక్తుల్ని, సంఘటనల్ని, అనుభవాల్ని, అనుభూతుల్ని ఎంతగా పదిలపరచుకోవాలో తెలియజెపుతారు. కథను మలచేతీరు ఎంతో అద్వితీయంగా ఉంది. ప్రపంచీకరణ ప్రభావంలో పడిన ఎవరి పరిధిలో వారు జీవిస్తున్నప్పుడు అందుకు కారణం వీరని ఎవరిని నిందించాలి? మనిషికి మనిషికి మధ్య మిగిలినవి కేవలం ఆర్థిక సంబంధాలే అని తేటతెల్లం చేసిన కథ "మాయమవుతున్న మనసు'.. మనసు తన ఆచ్ఛాదనను కోల్పోయిందని చెప్పడంలో ఎంతో ఆర్థ్రంగా చిత్రీకరించారు. బతుకులు ఎంత ఆధునికంలోకి ప్రయాణం చేస్తున్నా మనిషికోసమే మనం ఎదురుచూస్తుంటాం. అడ్డాలనాడు బిడ్డలు కానీ, గడ్డాలనాడు కాదు అనుకుంటూనే ఉంటాం. కానీ కన్న కొడుకు కనీసం ఫోన్‌లోనైనా పలకరించకపోతే విలవిలలాడిపోతాం. అలాంటిది పండగకు వస్తానని చెప్పి రాకపోతే ఆ తల్లి పడే ఆవేదనను అక్షరీకరించిన కథ "పండగ పడిగాపు" చదువుతున్నంత సేపూ మనసుకు భారంగా అనిపించింది. పిల్లల్ని కని పెంచడం, వారు ఆ తల్లితండ్రుల్ని పట్టించుకోక పోవడం నిత్యం జరుగుతున్న ప్రక్రియగా మారింది. కానీ ఇటీవల కాలంలో వృద్ధాశ్రమాల్లో వదిలేయడమే కాకుండా ఏకంగా అక్కర్లేదని తరిమివేయడం కూడా జరుగుతోంది. అలాంటి జీవితాలను వివరించే తీరులో సాగిన కథ "మానస సరోవరం". ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో మరియు ప్రైవేటు పాఠశాలల్లో సైతం ఆడపిల్లలకు కనీస వసతులు లేకుండా ఉండటం వింటున్నాం. చాలా చోట్ల చూస్తున్నాం. ఆ వైఖరి ఎంతమాత్రం నచ్చని ఈ రచయిత్రి రచించిన కథ "సహస్రధార". కనీసం మరుగుదొడ్లు కూడా లేని పాఠశాల విద్యాసంస్థల్ని, యాజమాన్యాన్ని అక్కడి పిల్లల అవస్థలు చూసి నిలదీసిన కథ ఇది. సంపాదన పేరుతో బిడ్డల్ని ఇంట్లో ఒంటరిని చేస్తున్న వైనాన్ని విపులీకరించిన కథ "బలికుసుమాలు". పరాయి ఆడదాని పొందుకోసం పరుగులు తీసే నీచులున్న సమాజంలోనే మనం ఇంకా బతికున్నాం. అలాంటి వారికి చివరికి ఏ గతి పడుతుందో తెలియజేసిన కథ "ఊరిడిచిన ఉత్తరం". ఈ కథలో చంద్రమ్మ పాత్ర తీసుకున్న నిర్ణయం చదివితే కాస్తయినా బుద్ధి వస్తుందేమో చూడాలి. "అమ్మ ఓడిపోయింది, జీవితమంటే పోరాడి గెలవాలంతే అని తెలిపే కథ "కొత్తమందు" కథలు నిజంగా ఎంతో ఆదర్శంగా నిలిచాయి. చదువు, ఉద్యోగం ఏ ఒక్కరి సొత్తు కాదు. అందరికీ చెందాలి అనే విషయంలో కులం మతం వంటివేవీ అడ్డు గోడలు కాకూడదని తెలిపే కథ "పసిదెట్లయితది" కులవృత్తులు కూలిపోయిన నేపథ్యంలో రచించిన కథ "రూపాంతరం" కుల వృత్తుల్ని నమ్ముకున్న పేదలు ఈ రోజు పడుతున్న అవస్థలు పడి చివరికి వ్యవసాయ కూలీగా రూపాంతరం చెందడం పట్ల వ్యక్తీకరించిన ఆవేదనకు అక్షర రూపం ఈ కథ.

ఇలా మానవ సంబంధాల పట్ల, మానసిక విపరీతాలు, వికారాల మధ్య సాగిన ఈ కథల సంపుటిలో ప్రతి కథా ఆహ్వానించదగినదే.. కవిత్వం రాసేవారు కథలు రాయకూడదనో లేక రాయలేరనో వినబడుతున్న తీరుకు ఒక గొప్ప సమాధానం జ్వలిత రచించిన "రూపాంతరం" కథల సంపుటి. మరిన్ని అద్భుతమైన కథలకు ఆహ్వానం పలుకుతూ రచయిత్రికి అభినందనలు తెలుపుతున్నాను

ప్రతులకు: జ్వలిత
98496 02663

## వాస్తవమైన కథలు "అంబలి గంప"






'కులం' ప్రాతిపదికగా సాగిన అనేక కథలు తెలుగు సాహిత్యంలో చోటుచేసుకోవడం మనకు విదితమే. ముఖ్యంగా బలహీన వర్గాలు అని చెప్పడం కాదు కానీ కలిసి పోరాడగలిగే ఐక్యత ఉన్న వర్గాల కథలు ఇప్పుడు కథా సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయనే చెప్పాలి. ఎందుకంటే వాటిల్లో సహజత్వం ఉంటుంది. ప్రత్యక్షంగా ఈ కథల గురించి చెప్పాలంటే మాదిగల జీవితాన్ని మరోసారి పరికించి చూడాల్సిందే అనిపిస్తుంది. ఆకలి, వెలివేత వంటి ఆవేదనలను మోస్తూ తమదైన జీవితాన్ని జీవించిన వీరి గురించి ఆలోచించడం ఆధునిక తెలుగు సాహిత్యం విస్మరిస్తోందా అనడానికి కూడా తావులేదు. ఆదరించినట్లు ఆదరిస్తూ పక్కకు నెడుతోందా అనే విషయం గురించి మాత్రం కాస్తంత ఎక్కువే ఆలోచించాలి. అగ్రహారాల్ని అంటిపెట్టుకున్న అక్షరాలు ఇప్పటికీ అక్కడే ఆగిపోయాయా అనిపించేలా ఉంది. కాలాన్ని నడిపించే వ్యక్తులు కొందరైతే, కాలాన్ని మోస్తూ గడిపిన వ్యక్తులు కొందరు, కాలం విధించిన అగ్ని పరీక్షలకు గురై జీవితాలనే పణంగా పెట్టినవారు మరికొందరు ఇలా అనేకమందిలో చాలా వరకు శిక్షలే అనుభవించారు. కొందరేమో శిక్షలను అమలు చేయ డంలో నిమగ్నమైపోయారు. పూలే సాంఘీక విప్లవం, అంబేద్కర్ సామాజిక విప్లవం, మార్క్స్ రాజకీయ విప్లవం కంటే నేడు జనవాహినిలోని రావాల్సింది మాదిగల పోరాటం. విప్లవం అంటే ఎర్రసిరానా, అంబేద్కరా అనేది ఇప్పటి ప్రశ్న కాదు. మాదిగలకు కొన్ని భావాలు కావాలి. అన్నింటికంటే ముఖ్యంగా మాదిగల సాహిత్యానికి విలువ, వారి జీవితాలను గురించిన విషయాలు ఉండి తీరాలనేదే వారి తపన..

కె.పి నర్సింహ కవిగా, పాటల రచయితగా ఇప్పటికే తెలుగు సమాజానికి, సాహిత్యానికి చిరపరిచితులే. ఇప్పటికే ఏడు రచనల దాకా రచించిన వీరు తాజాగా కథా రచనతో సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశించారు. అనేక దు:ఖాల నేపథ్యంలో నడిచినవే కెపి. లక్ష్మినర్సింహ కథలు.. వీరి కథల అంతస్సూత్రమే మాదిగల జీవితం, వారిలోని అంతర్గత ఆవేదన. ప్రపంచీకరణ దు:ఖాన్ని, అంటరానితనాన్ని, రాములవారి కళ్యాణాన్ని విభిన్న పార్శ్వాలతో చిత్రించిన తీరు ఈ కథల్లో మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వీరు రచించిన 16 కథలు ఆద్యంతం మాదిగలు ఎదుర్కొంటున్న జీవితపు సవాళ్ళను కథనం చేసాడు. ఈ సమస్యపై స్పందించిన మొదటి తరం కథకులు జాజుల గౌరి, కనకయ్య, జూపాక సుభద్ర, నాగప్పగారి సుందర్రాజు మాదిగల అలవాట్లు, ఆచారాలు, జీవిత వాస్తవాలను అక్షరీకరించారు. గొడ్డును కోసుకునే పంచుకునే దృశ్యాలను సుందర్రాజు కథల్లో ప్రతి ఫలిస్తాయి. మాదిగ స్త్రీల జీవితాలను చలం దృష్టితో కాకుండా అచ్చమైన మాదిగ తనంతో దర్శించారు. కానీ ఇప్పుడు అలా కాదు. కాలంతో పాటు వారిలో కూడా రాజకీయ చైతన్యం వచ్చింది. విశ్వవిద్యాలయాల చదువుల్లోకి వచ్చేవారి సంఖ్య పెరిగింది. గ్రామీణ సమాజంలో పెనుమార్పులు సంభవించాయి. ఊరికి దూరంగా జీవించే మాదిగలు ఊరిలో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా రాజకీయ భాగస్వామ్యంలోకి వచ్చారు. బోధనావృత్తు ల్లోకి, ఇతర అధికారులుగా కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సాగిన రెండో తరం కథలు మాదిగ కులంలో వచ్చారు. కనుక వారి రచనలలో కథా వస్తువు మారింది. సాంస్కృతిక జీవిత చిత్రణ నుంచి ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఈ తరం కథకుల్లో కనిపిస్తుంది. లక్ష్మినర్సింహ రెంటికీ తేడా తెలుపుతూ సమన్వయం చేసే రచయిత.

తొలితరం రచయిత్రి జాజుల గౌరి "మన్నుబువ్వ" అనే పేరు ఎంతో సంచలనం కలిగించింది. కానీ నేడు లక్ష్మినర్సింహ రచించిన అంబలి గంప అనేది కూడా విలక్షణమైన శీర్షిక. ఈ కథలో ఉన్న రెండు పాత్రలు, వారి మధ్య ప్రేమ, ఆప్యాయత ఎంతో ప్రశంసనీయంగా ఉంది. జీవిత సంక్షోభంలో వరిచేను ఎండిపోగా భర్త శరీరం చెట్టుకు వేల్లాడింది. వీరి ప్రేమ ఎక్కువ రోజులు నిలవలేకపోయింది. భర్త చావు గురించి తెలియని లక్ష్మి గంప నెత్తిన పెట్టుకుని గడప దాటుతుంటే కడపకు కాలు తగిలి అంబలి ఒలికింది. అదే విషాదానికి సూచికగా తెలిపిన తీరు ప్రశంసనీయం.

అలాగే "భీముడు" కథలో మూర్తి సార్ ఇచ్చిన అంబేద్కర్ జీవిత చరిత్రను చదివాక కొత్త వెలుగుల ప్రపంచంలోకి ప్రయాణించి, సామాన్యులు సైతం అసామాన్యులుగా అవుతారని గ్రహించిన భీముడు ప్రయాణం రాజ్యాధికారం దిశగా మళ్ళింది. ఈ రకంగా రచయిత తన మనసులోని ఎదుగుదలను పదిమందికి తెలియజేసిన తీరు అందరినీ అకట్టుకునేలా ఉంది. మిగిలిన కథలన్నీ అంటరాని తనం చుట్టూ ఉన్నాయి, కాలం మారినా కులతత్త్వం మారని తీరు గురించిన విషయాలను కెపి.లక్ష్మినర్సింహ తెలియజేసారు. ఏది ఏమయినా ఈ కాలానికి సంబంధించి ఒక మంచి రచయిత కెపి.లక్ష్మినర్సింహ అని చెప్పవచ్చు. ఉత్పత్తి అనేది కులాలకు అతీతమైనది. బాధ కులాలకు అతీతమైనది. ఆకలి, ఆశ అన్నీ కులాలకు అతీతమైనవి అని తెలియజేసే ఈ కథల గంప.. అంబలి లాగా తాగితే ఆరోగ్యం వస్తుందని తెలియజేస్తూ రచయితను అభినందిస్తున్నాను.

-ప్రతులకు: కెపి. లక్ష్మీ నరసింహ,
ఫోన్: 9010645470

## మరో అక్షర వంతెన "పదండి ముందుకు"






కవిత్వం స్వదస్తూరీతోనే ప్రచురణకు తీసుకునే ఏకైక సీనియర్ కవి అడిగోపుల వెంకట రత్నమ్ గారు. అందుకు పత్రికలలో కనిపిస్తున్న వీరి దస్తూరి అందుకు నిదర్శనం. 1984 సంవత్సరంలో ప్రారంభమైన వీరి కవితా సంపుటిలు 1992 వరకు వరుసగా వెలువడ్డాయి. తరువాత 2017 వరకు రెండేళ్ళకొకటిగా వెలువరించారు. వీరి కవిత్వం ఇతర భాషల్లోకి కూడా అనువదింపబడటం విశేషం. ముందడుగు కన్నడంలోకి, తమిళంలోని అనువదింపబడ్డాయి. అభ్యుదయ భావాలు కలిగి వీరి కలంలో ఇప్పటివరకు వచ్చిన కవితా సంపుటిలన్నీ పేరెన్నికగన్నవే. పదండి ముందుకు అనే కవితా సంపుటిలో అరవై కవిత్వా లున్నాయి. జీవితాంశాలన్నీ గుదిగుచ్చి అక్షరీకరించిన తీరు ఈ సంపుటిలో మనకు ద్యోతకమవుతాయి. కవిత్వానికి శీర్షికే ప్రధానం అనడంలో కూడా వీరు ప్రత్యేకత కనిపిస్తుంది. బొమ్మ కట్టిన బాల్యం, నదికి వయస్సు లేదు, నిశ్శబ్ధానికి శబ్ధం నేర్పుతూ.. ఎక్కాలు సవరించండి, నవ్వులన్నీ ఒక్కటి కాదు, కదలని పడవలు, స్వేచ్ఛకు స్వేచ్ఛ లేదు, స్వర్గం అమ్మబడదు అనే శీర్షికలు నా మాటకు ఉదాహరణలు. వీరి ప్రతి కవిత్వంలో స్వచ్ఛత, గాఢత మనకు కనిపిస్తాయి మచ్చుకు కొన్ని ...

**"బొంగరానికి దారం కట్టి/ భూమాత మీదికి విసిరితే/ ముల్లు గుచ్చుకుని గాయపడ్డా/ బిడ్డల ఆనందానికి మురిసి/ భూదేవి భాధను భరించేది"** (బొమ్మ కట్టిన బాల్యం)

**"భీముణ్ణి చూశాను/ బాల భీముణ్ణి చూశాను/ నాలుగు రోడ్ల కూడలిలో/ చింపిరి చాపపై వెల్లకిలా పడున్న/ బికారి బాలుణ్ణి చూసాను/ కనిపించని చూపుల్తో/ కనబడే ప్రపంచాన్ని చూస్తున్నాడు/ కనిపించని చూపుల్తో/ కనబడే బాలుడ్ని చూస్తూ ఉంది"** (సమాంతర భూలోకం)

**"వీధి బడిలో ఎక్కాలు చదువుతూ/ రెండొకట్ల రెండు/ రెండు రెండ్ల నాలుగు/ అన్న బాలుడి వీపుపై బెత్తం విరిగింది/ రెండు రెళ్ళు ఆరంటూ / ఎక్కం సవరించ బడిది"** (ఎక్కాలు సవరించండి)

**"అమ్మాయి ఆభరణాలు మోయ్యలేక/ చేపను పట్టిన గాలంలా వొంగిపోయింది/ అతని ఆస్తి ఎంతో అతనికి తెలియదు/ ప్రభుత్వానికి తెలుసు"** ( తులాభారం)

**"ఆత్మీయ స్పర్శ కోసం/ మేను ఎదురుచూస్తూ/ సంప్రీతి పిలుపు కోసం/ చెవులు రిక్కిస్తూ/ మాలిమి చూపు కోసం/ మనసు విప్పారటం చూసి/ వృద్ధాశ్రమం వొణుకుతూ ఉంది"**

**"నేలతల్లికి తన దర్పం చూపుతూ/ నింగితల్లి ధరించిన నక్షత్ర ఆభరణాల్ని/ ఒక్కొక్కటి విప్పి/ భోషాణంలో భద్రం చేస్తూంది"** (భూమిని మోసుకుంటూ)

ఇలా సాగుతున్న వీరి కవిత్వం ఒక్కోసారి ఆగ్రహంగానూ, మరోసారి వ్యంగ్యంగానూ, ఇంకోసారి ఆవేదనగానూ సాగుతుంది. **"మాతృభూమికి చేరువైతే/ నీ దేశం నీదే/ మాతృగడ్డకు భారమైతే / నీ దేశం పరాయిదే/ కర్షకుడి కంటి కన్నీరు/ దళారి ఇంట పన్నీరు"** అనగలిగే ఘనత ఈ కవికే చెల్లింది.
వీరికి నా నమస్కారాలు..

**ప్రతులకు:** అడిగోపుల
వెంకటరత్నమ్
ఫోన్: 98482 52946



సమీక్షకులు -శైలజామిత్ర
9290900879

